సమష్టి కృషితో కాంగ్రెస్ విజయం

కురవి: అందరి సమష్టి కృషితోనే జాటోత్ రాంచంద్రునాయక్ విజయం సాధించాడని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం, జిల్లా నాయకుడు బండి శ్రీనివాస్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాదావత్ రామునాయక్, మాజీ ఆలయ చైర్మన్ బండి లక్ష్మారెడ్డి, నాయకులు ఎర్ర నాగేశ్వర్‌రావు, గొల్లపల్లి రజనీకాంత్, బాలగాని శ్రీనివాస్, బాదె వీరభద్రం, శ్యామల శ్రీనివాస్, చిన్నంగణేష్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.


కురవి: మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సురేందర్, దయాకర్, పోలెపాక నాగరాజు, ఎండీ.అయూబ్‌ఖాన్, వోలం రమేష్, దామరకొండ ప్రవీణ్‌కుమార్, చిలువేరు సమ్మయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు రుణపడి ఉంటాం

కేసముద్రం: కాంగ్రెస్ పార్టీకి ఘన విజయాన్ని అందించిన ప్రజలకు రుణపడి ఉంటామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్, మహబూబాబాద్‌లో శంకర్‌నాయక్ నియంతపాలనకు ప్రజలు చరమగీతం పాడారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా డాక్టర్ మురళీనాయక్ గెలుపుకోసం కృషి చేసిన ప్రతీ కార్యకర్తకు, మెజార్టీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, బండారు వెంకన్న, కదిర


కేసముద్రం: మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు, దస్రూనాయక్

పాలకుర్తి అభివృద్ధికి యశస్విని భరోసా

తొర్రూరు: పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్‌కు అండగా నిలిచారని, ఈ ప్రాంత అభివృద్ధికి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి భరోసాగా నిలుస్తారని మాజీ టీపీసీసీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్‌లు అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యేగా యశస్వినిరెడ్డిని గెలిపించడాన్ని హర్షిస్తూ సోమవారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఓట్లు వేసి మార్పు చూపిన పాలకుర్తి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.


తొర్రూరు: మాట్లాడుతున్న నాయకులు

సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యా నాయక్, మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, నాయకులు అనుమాండ్ల నరేందర్‌రెడ్డి, మాచర్ల ప్రభాకర్, మేకల కుమార్, సోమ రాజశేఖర్, శ్యామ్ సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బలహీన వర్గాల అభ్యున్నతి

గార్ల: పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తోనే సాధ్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు అన్నారు. సోమవారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేగా కోరం కనకయ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, మండల ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్, శంషాద్ బేగం, తదితరులు పాల్గొన్నారు.


గార్ల: మాట్లాడుతున్న రామారావు

బస్సు సౌకర్యం కల్పించాలి

గార్ల: జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రమైన గార్లకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మండల ప్రజలు తమ సమస్యలను విన్నవించుకునేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయం, జిల్లా కోర్టు, ఆర్డీఓ కార్యాలయంకు రావాలంటే ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ఆటోల్లో ఇబ్బందులు పడుతూ రావాల్సి వస్తుందని వాపోతున్నారు. కొత్తగా మహబూబాబాద్ జిల్లా ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు గార్లకు బస్సు సౌకర్యం కల్పించలేదు. ఇప్పటికైనా ఆర్టీసీ డిపో మేనేజర్ స్పందించి గార్లకు ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయాలని మండల ప్రజలు డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులను మోసం చేసిన బీఆర్‌ఎస్

మహబూబాబాద్ అర్బన్: సీపీఎస్ రద్దు ఉద్యమానికి ఆజ్యం పోసింది టీ పీఆర్‌టీయూ హర్షవర్ధరెడ్డి అని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులను మోసం చేసిందని టీ పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో దేవేందర్ పాల్గొని మాట్లాడారు. ఇటీవల జరిగిన బదిలీలలో ఉద్యోగ ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన 317 జీఓ, స్పౌజ్ బదిలీల కోసం సంఘం ఎంతగానో పోరాడిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, మహేష్, బాబురావు, సుబ్బారావు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా..

మహబూబాబాద్: కార్యకర్తలు అధైర్యపడొద్దని ధైర్యంగా ఉండాలని మానుకోటలోనే 24గంటలు అందుబాటులో ఉండి కంటికి రెప్పలా కాపాడుకుంటానని తాజా మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల తీర్పును గౌరవిస్తున్నాని కాని ఘోరమైన తీర్పును ఇచ్చారన్నారు. కేవలం ప్రజా సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. తాను భూకబ్జాలకు పాల్పడ్డారని పలువురు ఆరోపణలు చేస్తున్నారని, అవి నిరూపిస్తే చర్చించడానికి సిద్ధమే అన్నారు. పార్టీలో పదవులు అనుభవిస్తూ తన ఓటమికి కారణమైన వారిని కోవర్టులపై సీఎం కేసీఆర్ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాణం ఉన్నంత వరకు కేసీఆర్ వెంటనే ఉంటానన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అమలు చేయకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. శంకర్‌నాయక్ ఓటమిపై పలువురు కార్యకర్తలు కంటతడి పెట్టుకోగా వారిని ఓదార్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైఎస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, జెడ్పీటీసీలు శ్రీనాథ్, శ్రీనివాస్‌రెడ్డి నాయకులు మార్నేని వెంకన్న, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, కెఎస్ఎన్ రెడ్డి, నాయిని రంజిత్, గుండా రాజశేఖర్, తేళ్ల శ్రీను, శంకర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శంకర్‌నాయక్

రైతులు అప్రమత్తంగా ఉండాలి

డోర్నకల్: మిచాంగ్ తుపాన్ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తుపాన్ ప్రభావంతో వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు. కోతలు పూర్తయిన రైతులు వరి ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆరుతడి పంటలకు నీటి తడులు, రసాయన మందుల పిచికారీ తాత్కాలికంగా వాయిదా వేయాలని, వర్షాలతో మెరుపులు, పిడుగులు పడే అవకాశం ఉన్నందున పొలాల్లో విద్యుత్ పనులు చేయరాదని, సెల్‌ఫోన్ టవర్ల సమీపంలో ఉండరాదని కోరారు.


బయ్యారం: ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పిన రైతులు

కోతల సమయంలో కారుమబ్బులు

బయ్యారం: ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికాడికి వచ్చిన సమయంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కారుమబ్బులు కమ్ముకుంటుండడంతో వరిసాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని బయ్యారం పెద్దచెరువు, తులారాం ప్రాజెక్టుతోపాటు పలు చెరువులు, కుంటల కింద వానాకాలంలో వరిపంటను సాగుచేశారు. సాగు చేసిన పంటను వరికోత యంత్రాలు, కూలీల ద్వారా కోతలు మొదలుపెట్టారు. ఈక్రమంలో వర్షం పడితే కోసిన ధాన్యంతో పాటు వరి పనలు తడిచిపోయి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. యంత్రాల ద్వారా కోసిన ధాన్యం వర్షం పడితే తడవకుండా రాశులపై రైతులు టార్పాలిన్లు కప్పారు.

ఒకరిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: తన తండ్రిని ఓ వ్యక్తి కొట్టి గాయపరిచాడని బాధితుడి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మహబూబాబాద్ టౌన్ సీఐ వై.సతీష్ సోమవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన వెన్నమల్ల శేఖర్ ఇంటి వద్ద నిద్రిస్తున్నాడు. ఈ క్రమంలో ఎర్రి నవీన్ అనే వ్యక్తి వచ్చి మద్యం తాగడానికి వెళ్దాం రమ్మని శేఖర్‌ను అడిగాడు. అదే సమయంలో రొయ్యల అశోక్ అనే వ్యక్తి వచ్చి కలుగజేసుకుని గతంలో ఉన్న పాత గొడవలతో ఘర్షణకు దిగాడు. అశోక్ అదే కోపంలో శేఖర్‌ను తలపగలగొట్టి గాయపరుస్తాడు. శేఖర్‌కు తీవ్రంగా గాయాలు కావడంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. జరిగిన సంఘటనపై బాధితుడి కుమార్తె సంగీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అందరిని సమానంగా చూసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

నెల్లికుదురు: ఇంట్లో ఉన్న ఆడ పిల్లలు, మగ పిల్లలను సమానంగా చూసుకున్నప్పుడే వారు జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ నలమాస అరుణ పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. మండలంలోని కాస్య తండా శివారు సంధ్య తండాలో ఐసీడీఎస్, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం బేటీ బచావో బేటీ పడావో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లల పెంపకం పట్ల వివక్షత చూపకుండా అవగాహన కల్పించి బాల్యవివాహాలను అరికట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉష, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పాలకుర్తి తీర్పు బీఆర్‌ఎస్‌కు గుణపాఠం

తొర్రూరు: పాలకుర్తి ప్రజలు ఇచ్చిన తీర్పు బీఆర్‌ఎస్‌కు గుణపాఠమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రామ్మోహన్‌రెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో లేగా మాట్లాడుతూ.. ప్రజలను మభ్యపెట్టి గెలుద్దామనుకున్న ఎర్రబెల్లికి పాలకుర్తి ప్రజలు తగు రీతిలో బుద్ధి చెప్పారని, డబ్బు, మద్యం ఎరచూపినా ప్రజలు లొంగకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించారన్నారు. మంత్రిగా ఉన్న సమయంలో దయాకర్‌రావు గులాబీ కార్యకర్తలకు మాత్రమే పథకాలు వర్తింపజేశాడని, సామాన్యులను విస్మరించాడన్నారు. దేశ వ్యాప్తంగా నాలుగు రాష్ట్రాల్లో బీజేపీ గెలుపొందడం శుభపరిణామమని, మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, కౌన్సిలర్ కొలుపుల శంకర్, నాయకులు రంగు రాములు, దుబ్బ రాజశేఖర్, సాయిని ఝాన్సీ, బొచ్చు సురేష్, సోమన్న, చింతా సృజన్‌లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

కళాశాలకు ప్రహరీ నిర్మాణం చేపట్టాలి


కళాశాల ఆవరణలో సంచరిస్తున్న గేదెలు

- ప్రహరీ లేక ఆవరణంలో సంచరిస్తున్న పందులు, గేదెలు

గార్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో పందులు మల విసర్జన దుర్గంధంతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గార్ల జూనియర్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి సుమారు 200 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. కళాశాల ఆవరణలో అడవిని తలపించేలా మొక్కలు పెరిగి పాములు ఇతర జంతువులు సంచరించే అవకాశం ఉన్నందున విద్యార్థులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు కళాశాల అడ్డాగా మారింది. యువకులు మద్యం సేవించి మద్యం సీసాలు పడేసి వెళ్లిపోతున్నారు. లక్షలాది రూపాయల విలువ చేసే ల్యాబ్ పరికరాలకు ఎటువంటి రక్షణ లేకుండా పోయిందని ప్రిన్సిపాల్ ఆర్.గోవిందరావు పేర్కొన్నారు. పలుమార్లు ఎమ్మెల్యే, ఎంపీలకు విన్నవించినా ఫలితం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి కళాశాలకు నైట్ వాచ్‌మెన్, ప్రహరీ నిర్మించి, సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

కాంగ్రెస్ సంబురాలు

మహబూబాబాద్ రూరల్: ఎమ్మెల్యేగా భూక్య మురళీనాయక్ గెలుపొందిన సందర్భాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ మండలంలోని మల్యాల గ్రామంలో సోమవారం సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు బెల్లి ముత్తయ్య, వేల్పుల శేఖర్, రమణయ్య, రమేష్, శ్రీశైలం, ఈశ్వర్, చెన్నయ్య, అనిల్, లింగయ్య, మొద్దిన్ పాల్గొన్నారు.

హస్తందే పైచేయి..

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని 10 పోలింగ్ బూతుల పరిధిలోని 15 వార్డులు, మండలంలోని 31 పోలింగ్ బూతుల పరిధిలోని 26 గ్రామ పంచాయతీలతోపాటు సీరోలు మండలంలోని ఆరు భూతుల్లో నాలుగు గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రాంచంద్రునాయక్, బీఆర్‌ఎస్ డీఎస్ రెడ్యానాయక్‌పై పూర్తిస్థాయి మెజారిటీ సాధించాడు.

మండలంలో హస్తం హవా..

కురవి: ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో డోర్నకల్ నియోజకవర్గం కురవి మండలంలో హస్తం హవా కనిపించింది. కురవి మండలంలో 9,304 ఓట్ల ఆధిక్యతను కాంగ్రెస్ పార్టీ సాధించింది. కాంగ్రెస్ పార్టీకి 21,596 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్‌పార్టీకి 12,332 ఓట్లు లభించాయి. కురవి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి అత్యధికంగా 1,118 ఓట్లు సాధించి మండలంలోనే టాప్‌గా నిలిచింది. బీఆర్‌ఎస్ పార్టీకి తిర్మలాపురం గ్రామంలో 20 ఓట్లు అధికంగా పడ్డాయి.

పేదల కోసం నిరంతరం పోరు

కురవి: పేదల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో కొత్తగూడెం ఎమ్మెల్యేగా సీపీఐ తరఫున పోటీ చేసిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విజయం సాధించడంపై కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కర్నం రాజన్న, నాయకులు నెల్లూరి నాగేశ్వర్‌రావు, బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, తురక రమేష్, బొల్లం ఉప్పలయ్య, బస్వ కొమురయ్య, కొణతం సత్యం, బొల్లం అనిల్, కొణతం మహేష్, విజయ్, సైదులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పూజ



గూడూరు: మండల కేంద్రంలో సోమవారం అయ్యప్పస్వామి మండల పూజలో భాగంగా ఓ భక్తురాలు ఇంట్లో మణికంఠుడి పడి పూజ అత్యంత భక్తి శ్రద్ధలతో పూజారి భానుశాస్త్రి నిర్వహించారు. కార్యక్రమంలో మాలాధరులు రంజిత్, దోసపాటి శ్రీనివాస్, వీరమల్లు, శ్రీనివాస్ గురుస్వాములు పాల్గొన్నారు.

శబరిమలకు పాదయాత్ర ప్రారంభం



కురవి: కురవి మండల కేంద్రానికి చెందిన ఐదుగురు వ్యక్తులు సోమవారం అయ్యప్పస్వామి మాల ధారణగావించి శబరిమల అయ్యప్పస్వామి ఆలయం వరకు పాదయాత్రను చేపట్టారు. మహబూబాబాద్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో కురవికి చెందిన వేమిశెట్టి సంతోష్, సంగెం నాగరాజు, కన్నె గురుమూర్తి, కిన్నెర మహేష్, బూర్గుల రాకేష్ స్వాములు మాలధరించి కురవికి పాదయాత్రగా చేరుకుని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో పూజలు చేశారు. కురవి నుంచి శబరిమలై వరకు సుమారు 13వందల కిలోమీటర్ల దూరం 50రోజులు పాదయాత్రగా వెళ్తున్నారు.

క్రీడా సామగ్రి అందజేత

నర్సింహులపేట: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో చదువుతున్న క్రికెట్ క్రీడాకారుడు భూక్య శివప్రసాద్‌కు క్రికెట్ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు మారినేని ఉదయభాన్‌రావు సోమవారం క్రీడా సామగ్రి, దుస్తులను పంపిణీ చేశాడు. సంఘం నాయకులు ప్రభాకర్, కుమార్, పీఈటీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించిన నాయకులు

కేసముద్రం: మహబూబాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా డాక్టర్ మురళీనాయక్ అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంపై సోమవారం మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో హనుమంతుడి విగ్రహం వద్ద పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు 101 కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కులను చెల్లించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష కార్తీక దీపోత్సవం

మహబూబాబాద్ రూరల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పారిజాతం సేవా ట్రస్టు వారి ఆధ్వర్యంలో పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో లక్ష కార్తీక మహా దీపోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం అర్ధరాత్రి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో మాలె నాగేశ్వర్‌రావు, పద్మావతి, యోగీశ్వర్రావు, సునీత, మాలె లక్ష్మణరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్యారంటీలను అమలు చేస్తుంది

పెద్దవంగర: కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడారు. పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రంగు మురళి గౌడ్, దుంపల శ్యామ్, వేముల వెంకన్న, సీతారాం నాయక్, జగ్గా నాయక్, శ్రీనివాస్, రవి, ఎల్లయ్య పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి



మరిపెడ రూరల్: పాత కక్షలు మనస్సులో పెట్టుకొని దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని దాడిలో గాయాలైన మండలంలోని బోట్యతండాకు చెందిన డీఎస్ లాల్‌సింగ్, కవిత, వెంకటి మంగ్తి, వినోద, హరిజ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ.. ఆదివారం గెలుపొందిన కాంగ్రెస్ కార్యకర్తలు బోట్యతండాలో విజయోత్సవ ర్యాలీ తీస్తున్న క్రమంలో కొందరు మాపై రాళ్లు, కర్రలతో తీవ్రంగా దాడి చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దాడి చేసిన డీఎస్ సుమన్, ప్రవీణ్, నవీన్, సురేష్, మహేష్, నరేష్, సోమన్న, గుగులోతు పాపలపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు వేడుకున్నారు. దాడి చేసిన వారిపై మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు లాల్‌సింగ్, కవిత, వెంకటి, మంగ్తి, వినోద, హరిజ తెలిపారు.

క్లుప్తంగా

ఎన్ఎంఎంఎస్ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలి



నెల్లికుదురు: ఎన్ఎంఎంఎస్ సెంట్రల్ పరీక్షలను 8వ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, ఉన్నత శిఖరాలకు ఎదగాలని సామాజిక వేత్త సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ సూచించారు. మండలంలోని ఆలేరు జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో సోమవారం ఎన్ఎఫ్‌హెచ్‌సీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ సెంట్రల్ పరీక్షలకు దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు సరిపడా స్టడీ మెటీరియల్, నోటు పుస్తకాలు, పెన్నులు అందించారు. ఆన్‌లైన్ క్లాసులు అవసరం ఉన్న విద్యార్థులు 89710 85157, 99893 10141 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాందాస్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ డేవిడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేత

కేసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఎన్ఎంఎంఎస్ సెంట్రల్ స్కాలర్‌షిప్ పరీక్ష రాయనున్న 8వ తరగతి విద్యార్థులకు, నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీమెటీరియల్, నోట్‌బుక్స్, పెన్నులను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సలహాదారులు డాక్టర్ పరికిపండ్ల అశోక్, హెచ్ఎం రాజు, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మూడావత్ మోహన్, శ్రీనివాస్, సదయ్య, చందర్ పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం



తొర్రూరు: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గెలుపోటములు సహజమేనని, దయాకర్‌రావు నాయకత్వంలో బాధ్యతాయుత ప్రతిపక్ష పాత్ర పోషిస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మహాసుదర్శన యాగం



మహబూబాబాద్ రూరల్: శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారి మంగళాశాసనములతో మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల గ్రామంలో సీతాలక్ష్మణహనుమత్ సమేత శ్రీరామచంద్రస్వామి వారి తృతీయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ముగిశాయి. సర్పంచ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి, బిందురెడ్డి, వెన్నం విజయకాంత్ రెడ్డి, శిల్పారెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపిక



నెహ్రూసెంటర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయి పోటీలకు మానుకోట కరాటే అకాడమీ విద్యార్థులు ఎంపికయ్యారని కోచ్ వీరూనాయక్ సోమవారం తెలిపారు. నల్లగొండ జిల్లాలో ఈ నెల 5నుంచి 7వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అండర్ 14బాలికల 30 కేజీల విభాగంలో సింధూ, 42 కేజీల విభాగంలో దీక్షిత, 46 కేజీల విభాగంలో మనస్విని, అండర్ 17బాలుర 74కేజీల విభాగంలో శివరామ్ ఎంపికయ్యారన్నారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనపర్చి పతకాలు సాధించాలని అన్నారు.

'గ్యారంటీ'ల అమలు ఖాయం

ఖానాపురం: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో అధిష్టానం ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీ పథకాల అమలు ఖాయమని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మోడెం ఎల్లగౌడ్ తెలిపారు. మండలంలోని బుధరావుపేట గ్రామంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.